వచ్చింది...'' తండ్రీ కూతుళ్ళ మధ్య గ్యాప్ రాకుండా చేయాలనే తపనతో అం ి సుమతి.

''నువ్వు వేరే చెప్పాలా? బై! మమ్మీ ఉంటాను'' అని చెప్పి ఫోన్ పెట్టేసింది కీర్తి.

సరిగ్గా సుమతి లిఫ్ట్ చేసినప్పుడే ఫోన్ లిఫ్ట్ చేసిన మనోహర్ ఈ సంభాషణంతా త బెడ్‌రూంలో ఉన్న ఎక్స్‌టెన్షన్ ద్వారా విన్నాడు. అతని ముఖాన నెత్తురు చుక్క లేదు.

తన ఇంతకాలం కళ్ళు మూసుకుని పాలుతాగుతున్న పిల్లిలా ప్రవర్తించానని, ఉపాధ్యాయవృత్తి ముసుగులో ఎన్నో ఘోరతప్పిదాలు చేశానని తెలుసుకుని సిగ్గుతో తలదించుకున్నాడు.

★ ★ ★

ఆనాటినుంచి అతని నైజం పూర్తిగా మారిపోయింది. కీర్తి ఔన్నత్యం తన మనోవికారాన్ని మనోవికాసంగా మార్చిందని గ్రహించాడు.

ప్రస్తుతం మనోహర్‌కి ప్రతి విద్యార్థిలోనూ కీర్తి కన్పిస్తోంది.

**-మాణిక్యాల శ్రీనివాసరావు**
**(హైదరాబాద్)**

# షాక్

''అమ్మాయి తెల్లగా కుందనం బొమ్మలా ఉంది. అందానికి అందం. చదువు పైగా మంచి సంప్రదాయమైన కుటుంబం. మంచి కట్నం కూడా ఇస్తామంటున్నారు. ఆ కట్నంలో కొంత వెనుక వేస్తే రేపు ఆడపిల్ల పెళ్ళికి పనికివస్తుంది కూడా. మరి నీకు ఏ కారణాన నచ్చలేదు'' సీతాపతి ప్రశ్నించాడు కొడుకు నరేన్‌ని.



''నచ్చలేదంటున్నానా'' అసహనంగా నరేన్ జవాబు.

''అదే...అదే...పదేపదే నచ్చలేదు అని ఆ నాలుగు అక్షరాలు చెప్తున్నావు కాదురా. దానికో కారణం ఉండాలి. నీతోపాటు, అమ్మ, చెల్లి, నేను చూశాం. నలుగురిలో ముగ్గురికి ఆ అమ్మాయి నచ్చింది. నీ ఒక్కడికే నచ్చకపోవడానికి ఆమెలో ఉన్న లోపం ఏంటి'' గర్జిస్తున్నట్లుగా అన్నాడు తండ్రి సీతాపతి.

''మీకు నచ్చితేసరా! పెళ్ళిచేసుకుని కాపురం చేసేవాడిని నేనా? మీరా'' నరేన్ వేసిన ఈ ప్రశ్నకి సీతాపతికి కళ్ళు పచ్చబడ్డాయి. చోద్యంలా చూస్తున్న తల్లి పూర్ణమ్మకి మతిపోయినంత పని అయింది బుగ్గ చెళ్ళు మనిపించేలా కొడుకుని కొట్టాలనుకుంది. కాని తండ్రినిని అంతటి ప్రశ్న వేసినవాడు తిరిగి తనని కొట్టకపోతాడా? అన్న భయంతో ఆగిపోయి

''ఒరేయ్ నరేన్. ఎవరితో మాట్లాడుతున్నావురా?'' అంది గొంతుక పెంచి.

''అవునమ్మా...నేనేం చేసేది. నచ్చలేదు అని చెబుతుంటే నాకెందుకీ బలవంతం''

''అవున్రా. నువ్వు చెప్పింది నేను వింటాను. అవతల పిల్లతండ్రి ఎంతో ఆశతో మంచి శుభవార్త చెప్తామని కోటి ఆశలతో ఎదురుచూస్తూ ఉంటాడు. పిల్ల నిజంగా అనాకారి అయితే..నేను నిర్భయంగా చెప్పేద్దును మావాడికి నచ్చలేదండీ అని. కాని అమ్మాయిలో లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. అంత చక్కని అమ్మాయి నచ్చలేదు అని ఎలా చెప్పగలన్రా..నే పట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్నట్లు మొండిగా మాట్లాడకుండా ప్రశాంతంగా మరోసారి ఆలోచించు'' ప్రాధేయపడుతూ సీతాపతి చెప్పడంతో..

''ఒకటికి పదిసార్లు ఆలోచించిచే చెబుతున్నాను...చ్చ...దు...అర్థం అయిందా?'' అక్షరానుపిడదీస్తూ, దీర్ఘాలు తీస్తూ బదులిచ్చాడు నరేన్.

''నచ్చకపోవడానికి కారణం ఏంటిరా?''

''నేను ఇంకో అమ్మాయిని ప్రేమించాను'' మెల్లగా నరేన్ జవాబు.

''అనుకున్నాను ఇలాంటి ప్రేమ వైరస్ ఏదో సోకి ఉంటుందని. అందుకే కుందనపు బొమ్మ లాంటి అమ్మాయి ఆ కళ్లకి నచ్చకపోవడం. మన ఇంటా వంటా ఇలాంటి ప్రేమ వ్యవహారాలు లేవురా. నువ్విలా ఎవరినో ప్రేమించేసి, దానినే పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే రేపు నీ చెల్లిని ఎవరు పెళ్ళి చేసుకుంటారు'' ఆక్రోశించాడు సీతాపతి.

''దాని సంగతి నాకు తెలీదు. నేను మాత్రం ఈ అమ్మాయిని చేసుకోనుగాక చేసుకోను. నేను ప్రేమించిన అమ్మాయిని తప్ప మరొకరిని పెళ్లాడే ప్రశ్నే లేదు''ఖరాకండిగా జవాబు చెప్పిన నరేన్ దగ్గరకి వెళ్ళి...

''చూడు నరేన్. ఈ ప్రేమలు...పెళ్ళిళ్ళు ఎక్కువకాలం నిలవ్వు. నీకంత మొండి పట్టుదల ఎందుకు. ఏంటి ఆ అమ్మాయిలో ఉన్న ప్రత్యేకత. ఈ అమ్మాయిలో లేనిదేంటి?'' అంటూ ప్రాధేయపడుతున్న తండ్రికి షాక్‌లాంటి జవాబు విన్పించింది.

''ఆమె నా పదిరోజుల బిడ్డకి తల్లి. ఇంకా నర్సింగ్‌హోంలోనే ఉంది''.

**-భళ్లమూడి నాగరాజు**
**(రాయగడ)**

## కథానిలయం ట్రస్ట్ వినతి

తెలుగు అకాడమీ-కథానిలయం సంయుక్త నిర్వహణలో 'కథాకోశం' పేర తెలుగు కథకు రిఫరెన్స్‌బుక్ తేవడానికి సెప్టెంబర్ 1, 2003 నుంచి కృషి జరుగుతోంది.

పదుగురు సలహా సభ్యుల సూచనమేరకు ఒక్కొక్క ఆరోపంలో కథ, కథానిక లేక గల్పికలు, రాసిన కథకుల పూర్తి పేరు, కలంపేరు, పుట్టినతేదీ, స్వస్థలం, విద్య, ఉద్యోగం లేదా వృత్తి, చిరునామా, ప్రచురించిన కథా సంపుటాల పేర్లు, ప్రచురణ వివరాలు, కథల సంకలనాల్లో వస్తే సంకలనాల వివరాలు, కథలకు లభించిన ప్రభుత్వ అవార్డులు (కథా సంపుటాలూ, సంకలనాలలో వచ్చిన మొత్తం కథల పేర్లు) పత్రికల్లో వచ్చిన కథల విషయంలో కథ పేరు, పత్రిక పేరు, ప్రచురించిన తేదీ నమోదవుతాయి.'కథాకోశం' సాధ్యమైనంత సమగ్రం చేయడానికి కథకులూ, కథాభిమానుల సహకారం అర్థిస్తున్నాం. ఇదివరకే కథానిలయానికి వివరాలు ఇచ్చినవారు మారిన చిరునామాలూ, ఇటీవల ప్రచురించిన కథల జిరాక్స్‌లూ ఇంతవరకూ పంపించకపోతే ప్రకటించిన కథా సంపుటాలూ, ఉద్యోగం లేదా వృత్తి వంటి అదనపు సమాచారం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో కథానిలయానికి పంపించగోర్తాము.ఇంతవరకూ కథానిలయానికి వివరాలివ్వని కథకులు ఒకకార్డు మీద తమ చిరునామా తెలియజేస్తే వివరాల కోసం కథానిలయం ఒక ఫారం పంపుతుంది. కీర్తిశేషులైన కథకుల విషయంలో వారి వారసులుగాని, అభిమానులూ, మిత్రులు గాని ఉత్తరం రాసి ఫారం తెప్పించుకుని సాధ్యమైనన్ని వివరాలు ఇవ్వవచ్చును.

చిరునామా

**కథానిలయం ట్రస్ట్, విశాఖ 'ఏ'కాలనీ దరి, శ్రీకాకుళం-532001 ఫోన్ నెం: 08942-220069**